క్లుప్తంగా

మందుబాబులకు అడ్డాగా డంపింగ్‌యార్డు



దంపింగ్‌యార్డులో తాగిపడేసిన ఖాళీ సీసాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): లక్షలు ఖర్చుచేసి నిర్మించిన డంపింగ్‌యార్డు మందుబాబులకు అడ్డాగా మారింది. చిలప్‌చెడ్ మండలం గుజిరి తండాలో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులో వేయాల్సి ఉండగా, సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులో వేయలేదు. ప్రస్తుతం నిధుల్లేక మండల గ్రామాలలో చెత్త సేకరణను నిలిపివేయడంతో డంపింగ్‌యార్డు అవసరం లేకుండా పోయింది. దాంతో అలంకారప్రాయంగా మారిన డంపింగ్‌యార్డు అసాంఘిక కార్యాకలాపాలకు నెలవుగా మారింది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రామాయంపేట(మెదక్): బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించినందున స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మెదక్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చింతల యాదగిరి, స్వామి, లింగం, నాగులు, తౌర్యా నాయక్, రవి, నర్సింలు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఈత మొక్కలు నాటిన అధికారులు



ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోటలో ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఈత మొక్కలు నాటారు. ప్రజలకు ఆరోగ్యానిచ్చే కల్లును అందుబాటులో ఉంచేందుకు గాను ఈత వనాలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత గౌడ సంఘం సభ్యులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కిషన్‌గౌడ్, రామాగౌడ్ తదితరులు ఉన్నారు.

బోనాలకు ఉత్సవాలకు ఆహ్వానం

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ పరిధిలో నేడు జరగబోయే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. సర్వే నం 27 తెలంగాణ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వివరాలు వివరించారు. అక్రమాలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు.

పార్కుల అభివృద్ధి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో శనివారం కార్పొరేటర్ పుష్ప పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. పలుచోట్ల డ్రైనేజీ సమస్య ఉందని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీలోని సొసైటీ ఆవరణలో పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

కొనసాగుతున్న నిరసనలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జెఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 158వ రోజుకు చేరుకున్నాయి. శనివారం రిలే నిరాహార దీక్షకు గ్రామస్తులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం డంపింగ్ ఏర్పాటును విరమించే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

బెజ్జంకి(సిద్దిపేట): రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగ్చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సౌజన్య హెచ్చరించారు. మండలంలోని బేగంపేటలో శనివారం స్పెషల్ పార్టీ, స్థానిక పోలీసులతో కలిసి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భం ఆమె మాట్లాడుతూ అలజడులు సృష్టించి ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

‘ఆరుతడి’ అంతంత మాత్రమే

వర్షాధార పంటలపై మొగ్గు చూపని రైతులు

- వేధిస్తున్న కోతులు, అడవి పందులు
- అందుబాటులో లేని యంత్ర పరికరాలు
- జిల్లా తగ్గిన అపరాల సాగు విస్తీర్ణం



సాగు చేయకుండా వదిలేసిన భూములు



నీళ్లులేక నాటు వేయని వరి పొలం

వర్షాకాలం వచ్చిందంటే ప్రతిరైతు తమ భూములను దున్ని చదునుచేసి ఆరుతడి పంటలు వేయడానికి సిద్ధం చేసేవారు. కాని జిల్లాలో నేడు ఆ పరిస్థితి లేదు. వర్షాలు సమృద్ధిగా, సకాలంలో కురువక పోవడంతో అన్నదాతలు ఆరుతడి పంటలపై ఆసక్తి చూపడం లేదు. అలాగే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేక పోవడంతో సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది.

దుబ్బాకరూరల్: వర్షా కాలంలో రైతులు ఏదో ఒక్క పంట సాగు చేసేందుకు బీడు భూములను కూడా దున్నేవారు. కానీ కొన్నేళ్లుగా మండల పరిధిలోని చాలా ప్రాంతాల్లో ఆ పరిస్థితి లేదు. కారణం వర్షాధార పంటలపై అన్నదాతలు ఆసక్తి చూపకపోవడమే. వర్షాకాలం వచ్చిందంటే గతంలో ఎక్కువగా ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, బొబ్బెర్లు లాంటి పంటలను ఎక్కువగా సాగు చేసేవారు. ప్రస్తుతం వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు ఆరుతడి పంటలవైపు మొగ్గు చూపడం లేదు. దీంతో భూములను దున్నకుండా వదిలి వేయండతో పొలాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లో వరిసాగు చేస్తుండగా.. ఆరుతడి పంటల సాగు చాలా తక్కువ స్థాయిలోనే ఉంది.

సమస్యలు అనేకం

ఆరుతడి పంటలు సాగు ప్రారంభించిన నాటి నుంచి రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది. వర్షాలు కురిసే వరకు ఎదురు చూడాలి. తీరా కురిశాక దుక్కులు దున్ని సాగు చేయాలి. సమయానికి వానలు కురవకపోతే పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పడిన కష్టం, పెట్టిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

అడవి పందులు, కోతుల బెడద

కోతులు, అడవి పందులు, ఇతర జీవరాశులు రైతులకు మరో పెద్ద శత్రువులుగా మారాయి. పంటలను నాశనం చేస్తాయనే భయం వెంటాడుతోంది. వర్షాధార పంటలకు అన్నదాతలు దూరమవడానికి ఇదో పెద్ద కారణమైంది. అదే విధంగా కూలీల కొరత, ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రాకపోవడంతో సాగుకు దూరమవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

“ మూడేళ్ల నుంచి దూరంగా ఉన్నాం..



ఒక్కప్పుడు ఆరుతడి పంటలు ఎక్కువగా వేసే వాళ్లం. రెండు, మూడు సంవత్సరాల నుంచి సాగుచేయడం లేదు. కూలీల కొరత, మరోవైపు కోతులు, అడవి పందుల బెడదతో వర్షాధార పంటలు వేయాలంటేనే భయంవేస్తోంది. వర్షాలు కురవకపోతే పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. పంటలు కోయడానికి ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రాలేదు. - డి.జోగయ్య, రైతు

తక్కువ స్థాయిలోనే సాగు



గతంలో రైతులు వర్షాకాలం వచ్చిందంటే ఆరుతడి పంటలపై ఎక్కువ శ్రద్ధ చూపే వారు. రెండు, మూడేళ్ల నుంచి వర్షాధార పంటలపై ఆసక్తి చూపడం లేదు. వర్షాలు సరైన సమయానికి కురువ పోవడంతో మొక్కజొన్న, జొన్న, కంది, పెసర, బొబ్బెర లాంటి పంటలను చాలా తక్కువ స్థాయిలోనే సాగు చేస్తున్నారు.

- ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ”

భూ కబ్జాపై చర్యలు తీసుకోండి

- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- ఇద్దరిపై కేసు నమోదు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం హస్తాల్‌పూర్ గ్రామ శివారులోని తమ భూమిని శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లికి చెందిన వెంకట్రామిరెడ్డి, ఓ వెంచర్ నిర్వాహకుడు ప్రసాద్‌రావ్ అక్రమంగా కబ్జా చేశారని అదే గ్రామానికే చెందిన జయలక్ష్మి ఆరోపించింది. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌లో నివాసముంటున్న తాము వరి పంట సాగు చేయడానికి వచ్చి చూసేసరికి వారసత్వంగా వచ్చిన భూమిలో అక్రమంగా దున్ని వరి నారు వేసినట్లు గుర్తించామన్నారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం వెంకట్రామిరెడ్డితో పాటు ప్రసాద్‌రావ్ తమ భూమిని ఆక్రమించి రాత్రికిరాత్రే హద్దులు పాతడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తుందన్నారు. కోర్టు తుదితీర్పు రాకముందే మరోసారి భూమిని ఆక్రమించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులను వేడుకున్నారు. ఈ విషయమై ఎస్సై రాజును వివరణ కోరగా.. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లుట్ల సబ్ స్టేషన్ 33/11కేవీలో మరమ్మతులు కారణంగా సరఫరా నిలిపివేయనున్నారు. పిల్లుట్ల, రత్నాపూర్, నాను తండాలకు విద్యుత్ ఉండదని ప్రజలు గమనించాలని సూచించారు.

వృద్ధులకు డే కేర్ కేంద్రాలు

ఎన్జీఓల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని వృద్ధుల కోసం ప్రభుత్వం డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు డీడబ్ల్యూఓ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాలు నిర్వహించడానికి ఆసక్తి, అర్హత గల స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 13 నుంచి 17వ తేదీలోపు మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ పరిధిలోని అనేక కాలనీలోని ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెల్లాపూర్‌కు సబ్‌స్టేషన్ మంజూరై ఏళ్లు గడుస్తున్నా నేటి దానిని వినియోగంలోకి తీసుకురాలేదని విమర్శించారు. నిత్యం విద్యుత్ కోతలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉప ముఖ్యమంతి భట్టి విక్రమార్కకు లేఖ రాసినట్లు తెలిపారు.

ప్రవీణ్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ప్రవీణ్ డాక్టరేట్ అర్హత సాధించారు. ఆర్పీ- హెచ్‌పీఎల్సీ, ఎల్సీఎంఎస్ పద్ధతులను ఉపయోగించి అమిట్రిప్టిలైన్, హైడ్రాక్సీజైన్, డోరిపెనెం యొక్క ఫార్మా స్యూటికల్ మోతాదు రూపాల విశ్లేషణాత్మక ప్రొఫైల్‌పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్‌బాబు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రవీణ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెజా, సిబ్బంది తదితరులు అభినందించారు.

మొబైల్ దుకాణంలో చోరీ

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని ర్యాకల్ రోడ్డులో ఉన్న ఎంఎ మొబైల్ దుకాణంలో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి దుకాణానికి వచ్చి రూ.22వేల విలువగల వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను తస్కరించాడు. చోరీ వివరాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ రికార్డులను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వం

బీఆర్‌ఎస్ నేతల ధ్వజం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మరోమారు ప్రయత్నం చేస్తుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ మహేష్‌గుప్తా విమర్శించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు న్యాయబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్ అమలు చేయకుండా కల్లబొల్లి మాటలతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. గతంలో బీసీలకు సంబంధించి రిజర్వేషన్ చట్టం చేసి కేంద్రానికి పంపించిన ప్రభుత్వం.. ప్రస్తుతం కొత్త ఆర్డినెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణకు కుట్ర పన్నిందన్నారు. సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన లక్ష్మీ నారాయణ

కౌడిపల్లి(నర్సాపూర్): ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన కౌడిపల్లి దాబా హోటల్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం.. బూరుగడ్డకు చెందిన చెల్ల లక్ష్మీనారాయణ (ప్రవీణ్) సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. కాగా సొంతపని ఉండటంతో బైక్‌పై కౌడిపల్లికి వస్తున్నారు. మెదక్ నుంచి నర్సాపూర్ వైపు ఆర్టీసీ బస్సు వెళుతోంది. కౌడిపల్లి దాబా హోటల్ సమీపంలో బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న చెల్ల లక్ష్మీనారాయణకు కాలు విరగగా తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడిని 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఓపెన్‌స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ఓపెన్‌స్కూల్‌లో ఇంటర్, ఎస్సెస్సీలో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 31వ తేదీ వరకు అపరాధ రుసుముతో ఎస్సెస్సీ, ఇంటర్‌లో చేరేందుకు గడువు పొడిగించదన్నారు. ఇతర వివరాలకు స్థానిక ఓపెన్‌స్కూల్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామానికి చెందిన కంపె రామస్వామి, స్వామిలు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రామస్వామికి రూ.23 వేలు, స్వామికి రూ.15 వేలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కులను శనివారం మాజీ సర్పంచ్ శంకర్‌యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్: నర్సాపూర్, హత్నూర మండలాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు రూ.30.58 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి అందజేశారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ఉన్నారు.

◆ అన్నదానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న, కొట్టాల, కంచన్‌పల్లి గ్రామాలలో శ్రీఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆంజనేయస్వామికి గ్రామ పురోహితులు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి చందన అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సీఎం బీసీల క్యాంపెయినర్

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్
- రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు పెద్ద క్యాంపెయినర్ అని, ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని నిర్ణయించారని ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. శనివారం రాందాస్ చౌరస్తాలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ, కేబినెట్ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. బీసీ రిజర్వేషన్‌లను అడ్డుకునే పార్టీలకు రాష్ట్రంలో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ఇప్పటి వరకు చట్టసభల మెట్లు ఎక్కని కులాల కోసమే బీసీ రిజర్వేషన్ల పెంచాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. బీసీల రిజర్వేషన్‌ల అమలు కోసం కాంగ్రెస్ పాటుపడితే.. బీఆర్‌ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మెదక్ అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్, 18 నెలల కాంగ్రెస్ పాలనపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, నేతలు సుప్రభాతరావ్, రాజిరెడ్డి, శ్రీనివాస్ చౌదరి, ప్రశాంత్ రెడ్డి, రమేష్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, గంటరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనంలో పోకిరీల ఆగడాలు

ఆట వస్తువులు ధ్వంసం



రాయరావు చెరువు కట్టపై ధ్వంసం చేసిన బెంచీలు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ రాయరావు చెరువు కట్టపై ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనం (పార్కు)లో పోకిరిలా ఆగడాలు మితిమీరుతున్నాయి. పార్కులో సందర్శకులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు, జిమ్ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు, చెరువు వైపు ఉన్న రేలింగ్‌ను ఒక్కొక్కటిగా ధ్వంసం చేస్తున్నారు. అలాగే.. రాత్రి వేళలో తాగుబోతులకు అడ్డాగా మారింది. శనివారం, ఆదివారం పార్కులో సేద తీరేందుకు సందర్శకుల వందల సంఖ్యలో వస్తుంటారు. నిర్వహణ బాధ్యతలు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడంతోనే పోకిరీల ఆగడాలకు అంతులేకుండా పోతుందని సందర్శకులు ఆరోపిస్తున్నారు.

విద్యార్థి కేంద్రీకృత విద్య అందించాలి

రాజకీయ విశ్లేషకులు సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

మెదక్‌జోన్: ఉపాధ్యాయ కేంద్రీకృత విద్యావిధానం కాకుండా విద్యార్థి కేంద్రీకృత విద్యావిధానం ఉండాలని రాజకీయ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు సుధాకర్ పేర్కొన్నారు. శనివారం మెదక్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుడు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. విద్యార్థులు గొప్ప వారైనప్పుడే గురువుకు గుర్తింపు వస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను విద్యార్థులకు అందించడంలో ఉపాధ్యాయుడు కీలక పాత్ర పోషిస్తాడన్నారు. కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, చల్లా లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి డి.భాస్కర్, బండి వెంకటేశ్, దత్తాత్రేయ కులకర్ణి, మార్గం రాజు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చేగుంటలో ఏర్పాటు చేసిన యూత్ కాంగ్రెస్ నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం యూత్ కాంగ్రెస్ ప్రత్యేక చొరవను చూపిస్తుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి శ్యాం సుందర్, ప్రధాన కార్యదర్శి వంశీరెడ్డి, దుబ్బాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉసాము ద్దీన్, నాయకులు మోహన్‌నాయక్, బోయిని శ్రీకాంత్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత



ఆలయం వద్ద మొక్కలు నాటుతున్న సిబ్బంది

శివ్వంపేట అటవీ అధికారి శ్రీధర్‌కుమార్

శివ్వంపేట(నర్సాపూర్): నాటిన ప్రతి మొక్కను పరిరక్షించడం అందరి బాధ్యత అని శివ్వంపేట అటవీ సెక్షన్ అధికారి శ్రీధర్‌కుమార్ అన్నారు. మండల పరిధి చాకరిమెట్ల అటవీలో కొలువైన శ్రీ సహకార ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం వన మహోత్సవం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖల ఆధ్వర్యంలో రావి, మొర్రి, మేడి, మర్రి, వేప, గులాబీ, మందారం, గన్నేరు, ఇతర మొక్కలు నాటారు. నాటిన మొక్కల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని అటవీ సెక్షన్ అధికారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవాదత్తశర్మ, బీట్ అధికారులు శ్రీవల్లి, గోపాల్, కుమార్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

భగీరథ కార్మికుల ఆందోళన బాట

- ఆరు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు

న్యాల్‌కల్(జహీరాబాద్): వేతనాల కోసం మిషన్ భగీరథ పథకం కార్మికులు మళ్లీ ఆందోళన బాట పట్టనున్నారు. 6 నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ జీతాలతో పని చేస్తున్న తమకు సమయానికి జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. జీతాల కోసం మూడు నెలల క్రితం కార్మికులు ఆందోళన చేపట్టగా చర్చలు జరిపి జీతాలను త్వరలో చెల్లిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో కార్మికులు మళ్లీ ఆందోళన బాట పట్టనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వారు మిషన్ భగీరథ ఎస్ఈకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. న్యాల్‌కల్ మండలంలోని 39 గ్రామాలతో పాటు తండాలు, ఝరాసంగం మండలంలోని సుమారు 36 గ్రామాలతో పాటు తండాలకు చాల్కి పిల్టర్ బెడ్ ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతోంది. నీటి సరఫరా పథకంలో తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్న 24 మంది కార్మికులకు గత ఆరు నెలల నుంచి జీతాలు అందడం లేదు. ఫలితంగా వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీతాల కోసం ఆందోళన చేసినప్పుడల్లా జీతాలు చెల్లిస్తామని చెప్తున్నా అధికారులు నెలలు గడిచినా పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చెల్లించాల్సిన జీతాలు జూలై 1న చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారని ఇచ్చిన గడువు ముగిసినా ఇప్పటివరకు వారి నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఈనెల 17 వరకు చెల్లించని యెడల విధులు బహిష్కరించి ఆందోళన చేపడుతామని ఎస్ఈకి ఇచ్చిన వినతిపత్రంలో అల్టిమేటం ఇచ్చినట్లు కార్మికులు వివరించారు.